క్లుప్తంగా...

ఎన్నిక



ఎన్నిక పత్రం అందుకుంటున్న నీరుడి దేవేందర్

మేడ్చల్‌రూరల్: మండలంలోని ఘనాపూర్ గ్రామ పరిధిలోని మెడిసిటి ఆస్పత్రి ఎంప్లాయీస్ యూనియన్ ప్రధాన కార్యదర్శిగా పూడూర్ గ్రామానికి చెందిన సీఐటీయూ నాయకులు నీరుడి దేవేందర్ ఎన్నికయ్యారు. బుధవారం ఆస్పత్రి ఆవరణలో జరిగిన సీఐటీయూ అంతర్గత ఎన్నికల్లో 90 ఓట్లతో సాధించిన దేవేందర్‌ను ప్రధాన కార్యదర్శిగా ఎన్నికైనట్లు ప్రకటిస్తూ ఎన్నిక పత్రాన్ని అందజేశారు.

డయాలసిస్ కేంద్రం ఏర్పాట్ల పరిశీలన



ట్యాంకు ఏర్పాటుకు స్థలాన్ని పరిశీలిస్తున్న ప్రాజెక్ట్ మేనేజర్, వైస్ చైర్మన్, మెడికల్ ఆఫీసర్

ఘట్‌కేసర్: పట్టణంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో ఏర్పాటు చేయనున్న డయాలసిస్ కేంద్రాన్ని మున్సిపల్ వైస్ చైర్మన్ మాధవరెడ్డితో కలిసి ప్రాజెక్ట్ మేనేజర్ అబ్దుల్ ఖాదిర్ బుధవారం సందర్శించారు. డయాలసిస్ కేంద్రానికి అవసరమైన నీటి ట్యాంక్‌ను ఏర్పాటు చేయాలని ఆస్పత్రి వైద్యాధికారి కోట్యానాయక్‌కు ఈ సందర్భంగా ఆయన సూచించారు. కార్యక్రమంలో ఆస్పత్రి అభివృద్ధి కమిటీ డైరెక్టర్ మీనా, కౌన్సిలర్లు వెంకట్‌రెడ్డి, నర్సింగ్‌రావు, మాజీ ఎంపీపీ శ్రీనివాస్‌గౌడ్, కీసరగుట్ట డైరెక్టర్ నరేశ్‌గౌడ్, మాధవరెడ్డి, సిరాజ్, విజయ్ పాల్గొన్నారు.

గౌడవెల్లి రోడ్డుకు నిధులు మంజూరు



పద్మజగన్‌రెడ్డి

మేడ్చల్: మండలంలోని గౌడవెల్లి రోడ్డు నిర్మాణంకు మంత్రి మల్లారెడ్డి నిధులను మంజూరీ చేసినట్లు గ్రామ ఎంపీటీసీ, మాజీ ఎంపీపీ పద్మజగన్‌రెడ్డి తెలిపారు. కండ్లకోయ నుంచి గౌడవెల్లి గ్రామం వరకు రోడ్డు నిర్మాణంకు రూ.3.10 కోట్లు మంజూరీ చేసినట్లు ఆమె తెలిపారు. తమ విన్నపం మేరకు మంత్రి నిధులు మంజూరీ చేయడంతో ఆమె మంత్రికి ధన్యవాదాలు తెలిపారు.

కౌన్సిల్ సాధారణ సమావేశం

జవహర్‌నగర్: జవహర్‌నగర్ కార్పొరేషన్ కార్యాలయంలో బుధవారం మేయర్ మేకల కావ్య ఆధ్వర్యంలో కౌన్సిల్ సాధారణ సమావేశం నిర్వహించారు. మేయర్ మాట్లాడుతూ.. మంత్రి మల్లారెడ్డి సహకారంతో కార్పొరేషన్ పరిధిలోని ప్రతి డివిజన్‌లో అభివృద్ధి పనులు వేగంగా జరుగుతున్నాయన్నారు. కార్పొరేషన్‌లో రూ.31.50 లక్షల అభివృద్ధి పనులకు పాలకవర్గం ఆమోదం తెలిపిందన్నారు. అంబేడ్కర్‌నగర్ నుంచి శాంతినగర్ వరకు 2 కి.మీ. పొడవున రహదారి నిర్మాణంతో ముప్పై ఏళ్ల నాటి సమస్యకు శాశ్వత పరిష్కారం దక్కిందన్నారు. అదేవిధంగా పెండింగ్‌లో ఉన్న పనులను వెంటనే పూర్తి చేస్తామన్నారు. కార్యక్రమంలో కమిషనర్ రామలింగం, డిప్యూటీ మేయర్ రెడ్డిశెట్టి శ్రీనివాస్, కార్పొరేటర్లు,కోఆప్షన్‌సభ్యులు, అధికారులు పాల్గొన్నారు.

నాగారంలో పెద్ద ఎత్తున అభివృద్ధి పనులు



పనులు ప్రారంభిస్తున్న చైర్మన్ చంద్రారెడ్డి

కీసర: నాగారం మున్సిపాలిటీ పరిధిలోని వివిధ వార్డుల్లో పెద్ద ఎత్తున అభివృద్ధి పనులు చేపట్టడం జరుగుతుందని మున్సిపల్ చైర్మన్ కౌకుట్ల చంద్రారెడ్డి అన్నారు. బుధవారం మున్సిపల్ పరిధిలోని 16వ వార్డులోని నేతాజీనగర్‌తో పాటు గోపికృష్ణకాలనీలో సుమారు రూ.17 లక్షల మున్సిపల్ నిధులతో చేపట్టనున్న సీసీరోడ్డు పనులను ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో కమిషనర్ వాణీరెడ్డి, వైస్ చైర్మన్ బండారి మల్లేష్ యాదవ్, కౌన్సిలర్ సుమిత్రసురేష్, కాలనీ అధ్యక్షుడు అందె ఓదెలు, జనరల్ సెక్రెటరీ నర్సిరెడ్డి, వైస్‌ప్రెసిడెంట్లు యాదిరెడ్డి, శ్రీధర్‌రెడ్డి, యాదిరెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, కేశవరెడ్డి ఉన్నారు.

వెంటనే పనులు పూర్తి చేయాలి



వైకుంఠధామంను పరిశీలిస్తున్న ప్రభాకర్‌రెడ్డి

ఘట్‌కేసర్: వైకుంఠధామం పనులు యుద్ధప్రాతిపదికన పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తేవాలని ఎగ్జిక్యూటీవ్ ఇంజినీర్(ఈఈ) ప్రభాకర్‌రెడ్డి అన్నారు. పట్టణంలోని చిన్నచెరువు వద్ద నిర్మిస్తున్న వైకుంఠధామం పనులు మున్సిపల్ వైస్ చైర్మన్ మాధవరెడ్డి, ఎస్ఈ వెంకటేశ్వర్లు, ఏఈ నరేశ్‌తో కలిసి బుధవారం పరిశీలించారు. అలాగే కొండాపూర్ సమీపంలో వెజ్, నాన్‌వెజ్ మార్కెట్ ఏర్పాటుకు అనువైన స్థలాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో కమిషనర్ వేమనరెడ్డి, కౌన్సిలర్లు వెంకట్‌రెడ్డి, నర్సింగ్‌రావు, మాజీ ఎంపీపీ శ్రీనివాస్‌గౌడ్ పాల్గొన్నారు.



- క్రీడా ప్రాంగణం లేక ఇక్కట్లు
- ఆచరణకు నోచుకోని ప్రజాప్రతినిధుల హామీలు
- ప్రతిభ ఉన్నా.. వెలుగులోకి రాని క్రీడాకారులు
- ఆటలకు దూరమవుతున్న దుస్థితి



ప్రారంభించారు.. పక్కన పడేశారు!

జవహర్‌నగర్‌లో ఆ ప్రాంత క్రీడాకారుల మినీ స్టేడియం కల నెరవేరేదెన్నడో..?

జవహర్‌నగర్: ఎన్నో ఏళ్లుగా ఎదురు చూస్తున్న జవహర్‌నగర్ ప్రజల మినీ స్టేడియం కల కలగానే మిగిలిపోతోంది. ఇక్కడి విద్యార్థులు, జాతీయ, రాష్ట్ర స్థాయి పోటీల్లో రాణిస్తున్నా సరైన సౌకర్యాలు లేక ఇబ్బందులు పడుతున్నారు. స్టేడియం లేకపోవడంతో సత్తా ఉన్న ఎంతో మంది యువత తమ ప్రతిభకు పదును పెట్టలేకపోతున్నారు. సరైన ఆట స్థలం లేకపోవడంతో మెరుగ్గా రాణించలేకపోతున్నారు. మినీస్టేడియం ఏర్పాటుతో పాటు యువ క్రీడాకారులకు తగిన వసతులు, సౌకర్యాలు కల్పించడంలో అటు ప్రభుత్వం, ఇటు అధికారులు, ప్రజాప్రతినిధులు విఫలమయ్యారని క్రీడాభిమానులు ఆరోపిస్తున్నారు.

మరెన్నో పథకాలు సాధించే అవకాశం..

జవహర్‌నగర్‌లో సరైన క్రీడా ప్రాంగణం లేకపోవడంతో చాలా మంది విద్యార్థులు, యువత క్రీడలకు దూరమవుతున్నారు. మరికొందరు మాత్రం క్రీడలపై మరింత ఇష్టంతో సుదూర ప్రాంతాలకు వెళ్లి వారికి నచ్చిన క్రీడల్లో తర్ఫీదు పొందుతున్నారు. అయితే స్థానికంగా మినీస్టేడియం ఏర్పాటు చేస్తే క్రికెట్‌తో పాటు వాలీబాల్, కరాటే, అథ్లెటిక్స్ కబడ్డీ, ఖోఖో, టెన్నీస్ తదితర పోటీల్లో ఎలాంటి ఇబ్బందులు లేకుండా మరింతగా రాణించే అవకాశం ఉంటుంది.

పట్టించుకోని అధికారులు, ప్రజాప్రతినిధులు ..

జవహర్‌నగర్ పట్టణంలో మినీ స్టేడియం ఏర్పాటు చేయాలని గతంలో ఎన్నోసార్లు విద్యార్థులు, విద్యార్థి సంఘాలు అధికారులు, ప్రజాప్రతినిధులకు వినతిపత్రాలు అందించినా ఫలితం లేకుండా పోయింది. జవహర్‌నగర్‌లో దాదాపు 3 లక్షల జనాభా ఉన్నారు. వీరిలో లక్షకు పైగా యువకులు ఉన్నారు. గత కొన్ని రోజుల క్రితం మేయర్ కావ్య, ఇతర ప్రజాప్రతినిధులు, నాయకులు, అధికారులతో కలిసి హడావుడిగా జవహర్‌నగర్‌లోని సర్వే నంబర్ 704,706లలో ఐదెకరాల స్థలంలో గతేడాది జూన్ 2న మినీస్టేడియాన్ని ప్రారంభించినా ఇప్పటి వరకు ఎలాంటి అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టలేదు. దీంతో తెలంగాణ ప్రభుత్వ క్రీడా మైదానం పేరుతో పెట్టిన బోర్డును సైతం తొలగించారు.

హామీలు నీటి మూటలు

జవహర్‌నగర్‌లో మినీ స్టేడియం ఏర్పాటుకు పాలకులు ఇచ్చిన హామీలు నీటి మూటలుగా గాలికి వదిలేశారు. జవహర్‌నగర్‌లో 2 జిల్లా పరిషత్, 8 ప్రైమరీ పాఠశాలలుండగా దాదాపు 30కి పైగా ప్రైవేట్ పాఠశాలలు ఉన్నాయి. జవహర్‌నగర్‌లో క్రీడాకారులకు అరకొర వసతులున్నా జాతీయ, రాష్ట్ర స్థాయిలో ఎంతో మంది విద్యార్థులు ఎంపికై విజయాలు సాధించి బహుమతులు సాధించారు. క్రీడా పోటీల ప్రారంభ కార్యక్రమాల్లో పాల్గొన్న అతిథులు, నాయకులు, అధికారులు జవహర్‌నగర్‌లో మినీ స్టేడియం ఏర్పాటు చేస్తామని హామీ ఇస్తున్నా.. ఆచరణలో మాత్రం 'ఎక్కడ వేసిన గొంగళి అక్కడే' అనే చందంగా మారింది.

కార్పొరేషన్‌కు అప్పగించిన స్థలాలు...

జవహర్‌నగర్ కార్పొరేషన్‌గా ఏర్పడిన తర్వాత ప్రభుత్వం ప్రజావసరాలకు వివిధ స్థలాలను కేటాయించింది. సర్వే నంబర్.510లో 17 గుంటల్లో చిల్డ్రన్స్ పార్క్‌కు, సర్వే నంబర్ 495/పీలో 510గజాలలో మోడ్రన్ షీటాయిలెట్స్‌కు, 420/పీలో 20గుంటల్లో మినీ డంపింగ్‌యార్డ్‌కు, 432/పీలో 1500 గజాల్లో మోడ్రన్ షీటాయిలెట్స్‌కు, సర్వే నంబర్.648లో 4.10 ఎకరాల్లో నర్సరీకి, 647/పీలో 1.34 గుంటల్లో తంగెడువనంకు, సర్వే నంబర్.704,706లలో 5 ఎకరాల్లో మినీ స్టేడియం ఏర్పాటుకు, సర్వే నంబర్ 759, 954లలో 4.03 ఎకరాల్లో హెర్బల్ పార్క్‌కు, సర్వే నంబర్ 673/పీలో 4 ఎకరాల్లో బృహత్ పట్టణ ప్రకృతి వనంకు, సర్వే నంబర్ 706లో 2 ఎకరాల్లో వైకుంఠధామం, సర్వే నంబర్ 173, 201లలో 1.6 ఎకరాల్లో మరో వైకుంఠధామం, 614/పీ,615/పీ లలో 2 ఎకరాల్లో వెజ్‌నాన్‌వెజ్ మార్కెట్, సర్వే నంబర్ 70లో ఎకరం స్థలంలో జంతు జనన, నియంత్రణ కేంద్రం ఏర్పాటుకు కేటాయించింది. వీటిలో ఒకటి రెండు మినహా ఇప్పటి వరకు ఏ స్థలాన్ని మున్సిపల్ అధికారులు పరిరక్షించుకోలేకపోవడం గమనార్హం.

భూముల పరిరక్షణలో అధికారులు విఫలం...

ప్రభుత్వం ప్రజావసరాల నిమిత్తం అప్పట్లో మున్సిపాలిటీకి కేటాయించిన స్థలాలను కాపాడుకోవడంలో పాలకవర్గం, అధికారులు పూర్తి స్థాయిలో విఫలమవుతున్నారు. గ్రామపంచాయతీ నుంచి మున్సిపల్ ఆపై కార్పొరేషన్‌గా అవతరించిన అనంతరం రెవెన్యూ అధికారులు ప్రజావసరాల కోసం వివిధ ప్రాంతాల్లో కేటాయించిన ఏ ఒక్క స్థలాన్ని స్వాధీనం చేసుకుని అభివృద్ధి పనులు ప్రారంభించిన దాఖలాలు లేవు. కేటాయించిన స్థలాల్లో కనీసం ఫెన్సింగ్‌లు ఏర్పాటు చేయకపోవడంతో అవి అక్రమార్కుల చేతుల్లోకి వెళ్లిపోతున్నాయి. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, అధికారులు చొరవ తీసుకుని ప్రజావసరాల కోసం కేటాయించిన స్థలాలను కాపాడాలని స్థానికులు కోరుతున్నారు.

కేటాయించిన అన్ని స్థలాలను కాపాడుతాం



జవహర్‌నగర్‌లో ప్రజావసరాల కోసం కేటాయించిన ప్రతీ స్థలాన్ని కాపాడుతాం. ఇప్పటికే కొన్ని అభివృద్ధి కార్యక్రమాలు కొనసాగుతున్నాయి. కలెక్టర్‌తో మాట్లాడి మరిన్ని నిధులు తీసుకు వచ్చి కేటాయించిన స్థలాలన్నింటికి ఫెన్సింగ్ ఏర్పాటు చేస్తాం. రెవెన్యూ శాఖ మున్సిపల్‌కు కేటాయించిన కొన్ని స్థలాల్లో కోర్టు వివాదాలు ఉన్నాయి. వాటిని పరిష్కరించే దిశగా చర్యలు తీసుకుంటున్నాం.

– రామలింగం, కమిషనర్, జవహర్‌నగర్ కార్పొరేషన్

ఆట స్థలం లేక ఇబ్బందులు



జవహర్‌నగర్‌లో మినీస్టేడియం లేక నిరుపేద క్రీడాకారులు తమ ప్రతిభ చూపలేకపోతున్నారు. ప్రతిభ ఉన్నా ఆటస్థలం, సరైన శిక్షణ లేకపోవడంతో ఆటల్లో రాణించలేకపోతున్నారు. గతంలో చాలా మంది రాష్ట్ర, జాతీయ స్థాయికి ఎదిగిన క్రీడాకారులు ఉన్నారు. ఇప్పటికైనా యువ క్రీడాకారులను దృష్టిలో పెట్టుకుని క్రీడా ప్రాంగణాన్ని ఏర్పాటు చేసి వారిని ప్రోత్సహించాలి.

– కూరపాటి రాజశేఖర్, ఫిజికల్ డైరెక్టర్, సీఆర్‌పీఎఫ్ పాఠశాల

స్టేడియంతో పాటు కోచ్‌నూ నియమించాలి



సుమారు 3 లక్షల జనాభా ఉండే జవహర్‌నగర్‌లో మినీస్టేడియం ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉంది. అథ్లెటిక్స్‌లో ఎంతో మంది యువకులు, విద్యార్థులు రాణించే అవకాశం ఉంది. మినీస్టేడియం ఏర్పాటు చేస్తే జాతీయ స్థాయి క్రీడాకారులుగా ఎదిగేందుకు మరింతగా దోహదపడుతుంది.

– కానుగంటి నరేందర్‌యాదవ్, తైక్వాండో యూనియన్ ప్రధానకార్యదర్శి, మేడ్చల్‌జిల్లా

గణతంత్ర వేడుకలకు.. మేడ్చల్ కలెక్టరేట్ సిద్ధం

- ఏర్పాట్లను పర్యవేక్షించిన అదనపు కలెక్టర్



ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్న అదనపు కలెక్టర్ నర్సింహారెడ్డి

సాక్షి,మేడ్చల్ జిల్లా: గణతంత్ర దినోత్సవ వేడుకలకు మేడ్చల్ కలెక్టరేట్ సర్వం సన్నద్ధమైంది. కలెక్టరేట్‌లో గురువారం జరిగే గణతంత్ర వేడుకకు సంబంధించి అన్ని రకాల ఏర్పాట్లను జిల్లా అధికార యంత్రాంగం పూర్తి చేసింది. ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అందరికీ అన్ని రకాల సదుపాయాలు కల్పించారు. మైదానంలో జాతీయ పతాకావిష్కరణ మొదలుకుని.. సభావేదిక, సభాస్థలి, ఆవరణలో అన్ని సౌకర్యాలు ఉండేలా చర్యలు తీసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టరేట్‌కు వచ్చే వీఐపీలు, అధికారులు, స్వాతంత్ర్య సమరయోధులు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్న విద్యార్థులకు ఇబ్బందులు తలెత్తకుండా తాగునీటితో సకల సదుపాయాలు కల్పించారు. రెండు దారులతో పాటు బారీకేడ్లు ఏర్పాటు చేశారు. బందోబస్తుకు పోలీసులు తగిన చర్యలు తీసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టరేట్ మైదానంలో 74వ గణతంత్ర దినోత్సవానికి సంబంధించిన ఏర్పాట్లను బుధవారం సాయంత్రం అదనపు కలెక్టర్ నర్సింహారెడ్డి జిల్లా రెవెన్యూ అధికారి లింగ్యానాయక్‌తో కలిసి పర్యవేక్షించారు.

వేడుక షెడ్యూల్ ఇలా....

శామీర్‌పేట మండలం తూముకుంట మున్సిపాలిటీ పరిధిలోని సమీకృత జిల్లా అధికారుల కార్యాలయ ప్రాంగణ పరేడ్ గ్రౌండ్స్ (నూతన కలెక్టరేట్ కార్యాలయం)లో గురువారం ఉదయం 9.30 గంటలకు జిల్లా కలెక్టర్ జాతీయ పతాకాన్ని ఆవిష్కరిస్తారు. అనంతరం ఉదయం 9.35 గంటలకు పోలీసుల నుంచి గౌరవ వందనం స్వీకరణ, ఉదయం 9.50 గంటలకు జిల్లా ప్రజలను ఉద్దేశించి కలెక్టర్ ప్రసంగం, ఉదయం 10.20 గంటలకు విద్యార్థులచే సాంస్కృతిక ప్రదర్శనలు, కార్యక్రమాలు ఉంటాయి. అనంతరం ఉదయం 10.50 గంటలకు అవార్డుల ప్రదానోత్సవం ఉంటుంది.

'కంటి వెలుగు ఓ బృహత్తర కార్యక్రమం'


- మంత్రి చామకూర మల్లారెడ్డి
- డబిల్‌పూర్, రాయిలాపూర్ గ్రామాల్లో పర్యటన



కంటి వెలుగును ప్రారంభిస్తున్న మంత్రి మల్లారెడ్డి

మేడ్చల్‌రూరల్: సీఎం కేసీఆర్ ముందు చూపుతో తెలంగాణ ప్రభుత్వం తలపెట్టిన కంటి వెలుగు ఓ బృహత్తర కార్యక్రమమని మంత్రి మల్లారెడ్డి అన్నారు. మండలంలోని డబిల్‌పూర్, రాయిలాపూర్ గ్రామాల్లో బుధవారం పర్యటించిన మంత్రి డబిల్‌పూర్‌లో రెండో విడత కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం డబిల్‌పూర్, లింగాపూర్, రాయిలాపూర్ గ్రామాల పరిధిలో రూ.3.80 కోట్లతో చేపడుతున్న బీటీ రోడ్ల పనులకు శంకుస్థాపన చేశారు. మంత్రి మాట్లాడుతూ... దేశంలో ఎక్కడా లేని విధంగా రాష్ట్రంలో కంటి వెలుగు కార్యక్రమం చేపట్టి ప్రజలకు కంటి లోపాలను తొలగిస్తున్నారని, ప్రతీ ఒక్కరూ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కేసీఆర్ చేపడుతున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలతో రాష్ట్రంలోని గ్రామాలు శరవేగంగా అభివృద్ధి చెందుతున్నాయన్నారు. రాష్ట్రాన్ని అన్ని విధాల అభివృద్ధి పథంలో నిలుపుతున్న సీఎం కేసీఆర్ బీఆర్ఎస్ పార్టీతో దేశంలో జెండా ఎగురవేసి తెలంగాణ మాదిరి ఇతర రాష్ట్రాలను అభివృద్ధి పథం వైపు నడిపిస్తాడని దీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ రజిత రాజమల్లారెడ్డి, జెడ్పీటీసీ శైలజ విజయానందరెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ భాస్కర్‌యాదవ్, జిల్లా రైతు బంధు అధ్యక్షుడు నందారెడ్డి, జిల్లా గ్రంథాలయాల చైర్మన్ దయాకర్‌రెడ్డి, సర్పంచులు గీతా భాగ్యారెడ్డి, నర్మద గోపాల్‌రెడ్డి, లక్ష్మి సంజీవయ్య, ఎంపీడీఓ పద్మావతి, మండల బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు దయానంద్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

నాగారం సమస్యలపై మంత్రి సమీక్ష



సమీక్షలో అధికారులు, పాలకవర్గంతో మాట్లాడుతున్న మంత్రి మల్లారెడ్డి

కీసర: నాగారం మున్సిపాలిటీ పరిధిలో వరదనీటి సమస్యను పరిష్కరించడంతో పాటు వివిధకాలనీలో మంచినీటి సరఫరా నిమిత్తం చేపట్టాల్సిన పనులపై బుధవారం హెచ్ఎండీఏ అధికారులు, హెచ్ఎండబ్ల్యూఎస్ అధికారులు, ఎస్ఎన్‌డీపీ అధికారులతో పాటు మున్సిపల్ పాలకవర్గం, అధికారులతో మంత్రి మల్లారెడ్డి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కోమటికుంట చెరువు నుంచి చర్లపల్లి చెరువు వరకు వరదనీటి కాలువ నిర్మాణ పనులను చేపట్టేందుకు సుమారు రూ.57 కోట్ల మేర నిధులు అవసరమవుతాయని అన్నారు. ఇందులో భాగంగా మొదటి విడతలో హెచ్ఎండీఏ ఆధ్వర్యంలో రూ.8 కోట్ల నిధులను మంజూరు చేశామన్నారు. మొదటగా చర్లపల్లి చెరువు నుంచి పనులు ప్రారంభిస్తామని, మిగిలిన పనుల నిమిత్తం అవసరమైన నిధులను కూడా త్వరలో మంజూరు చేయిస్తామన్నారు. అదేవిధంగా మున్సిపల్ పరిధిలోని వివిధ వార్డుల్లో నెలకొన్న మంచినీటి సమస్యను శాశ్వతంగా పరిష్కరించేందుకు అవసరమైన చోట కొత్తగా పైప్‌లైన్లు, ట్యాంకుల నిర్మాణ పనులను చేపట్టనున్నట్లు మంత్రి తెలిపారు. సమావేశంలో నాగారం మున్సిపల్ చైర్మన్ కౌకుట్ల చంద్రారెడ్డి, వైస్ చైర్మన్ బండారి మల్లేష్‌యాదవ్, కమిషనర్ వాణీరెడ్డి, హెచ్ఎండీఏ అధికారులు ఈఈ పద్మ, డీఈ వెంకటరమణ, జలమండలి అధికారులు స్వామి, శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

భవన నిర్మాణ కార్మికులకు ఆఫీస్ కట్టిస్తా..



మంత్రి మల్లారెడ్డికి వినతిపత్రం ఇస్తున్న కార్మికులు

పోచారం: అన్నోజిగూడ రాజీవ్ గృహకల్ప కాలనీలో భవన నిర్మాణ కార్మిక సంఘానికి కార్యాలయాన్ని కట్టిస్తానని కార్మిక శాఖ మంత్రి చామకూర మల్లారెడ్డి హామీ ఇచ్చారు. రాజీవ్ గృహకల్పలోని 77వ బ్లాక్ ఎదురుగా నిర్మిస్తున్న సంఘం కార్యాలయాన్ని అక్రమ నిర్మాణంగా పేర్కొంటూ మున్సిపల్ సిబ్బంది ఇటీవల కూల్చివేశారు. ఈ విషయాన్ని నిర్మాణ కార్మికులు మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. కార్మిక సంఘ సమావేశాలు నిర్వహించుకోవడానికి వీలుగా తాత్కాలిక నిర్మాణం చేపడితే అధికారులు కూల్చివేశారని చెప్పారు. గతంలో 78వ బ్లాక్ ఎదురుగా తడికలతో ఏర్పాటు చేసిన ఆఫీస్ పాడైపోవడంతో అదే చోట రేకుల రూము నిర్మించుకోవాలని పనులు ప్రారంభిస్తే స్థానికులు అడ్డుకోవడంతో 77వ బ్లాక్‌కు ఎదురుగా నిర్మాణ పనులు చేపడితే మున్సిపల్ సిబ్బంది నిలిపివేయించారన్నారు. కార్మిక సంఘ కార్యాలయాన్ని కట్టికోనివ్వాలని కోరుతూ మంత్రికి వినతిపత్రం ఇచ్చారు. మంత్రి స్పందిస్తూ.. భవన నిర్మాణ కార్మిక సంఘ కార్యాలయాన్ని కాలనీలో తానే స్వయంగా కట్టించి ఇస్తానని హామీ ఇచ్చారు. మంత్రిని కలిసిన వారిలో సంఘ అధ్యక్షుడు కె.గోపాల్, ఉపాధ్యక్షుడు టి.రాజు, ప్రధాన కార్యదర్శి కంది భాస్కర్, కోశాధికారి ఇ.ఉపేందర్, రమేష్, బాబు, ఈశ్వర్, తిరుపతి, హరిసింగ్ తదితరులు ఉన్నారు.

ప్రజాస్వామ్యంలో ఓటే వజ్రాయుధం

- మేడ్చల్ నియోజకవర్గంలో జాతీయ ఓటరు దినోత్సవం
- ర్యాలీలు, ప్రతిజ్ఞతో ఓటు హక్కుపై అవగాహన

జాతీయ ఓటరు దినోత్సవ వేడుకలను మేడ్చల్ నియోజకవర్గంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ, ప్రైవేటు కార్యాలయాలతో పాటు విద్యా సంస్థల్లో నిర్వహించిన కార్యక్రమంలో ఓటు విలువ గురించి అవగాహన కల్పించడంతో పాటు ర్యాలీలు చేపట్టి మానవహారం నిర్వహించారు. అనంతరం 'ఓటరు' ప్రతిజ్ఞ చేశారు. ఆయా కార్యక్రమాల్లో అధికారులు, ప్రజాప్రతినిధులు, విద్యార్థులు, ఉపాధ్యాయులు, వివిధ పార్టీల నాయకులు పాల్గొన్నారు. – మేడ్చల్ జోన్ బృందం



సాక్షి,మేడ్చల్ జిల్లా: కలెక్టరేట్‌లో ప్రతిజ్ఞ చేస్తున్న మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా అదనపు కలెక్టర్ అభిషేక్ అగస్త్య. జిల్లా రెవెన్యూ అధికారి లింగ్యానాయక్ తదితరులు.



మేడ్చల్: గుండ్లపోచంపల్లిలో ప్రతిజ్ఞ చేయించిన మంత్రి మల్లారెడ్డి, చిత్రంలో మున్సిపల్ చైర్ పర్సన్ లక్ష్మీశ్రీనివాస్‌రెడ్డి, వైస్ చైర్మన్ ప్రభాకర్, కమిషనర్ రాములు కౌన్సిలర్లు, మున్సిపల్ సిబ్బంది



కీసర: కీసరలో నిర్వహించిన ర్యాలీలో ఎంపీపీ ఇందిరాలక్ష్మీనారాయణ, జెడ్పీ వైస్ ఎంపీపీ బెస్త వెంకటేష్, వైస్‌ఎంపీపీ జె.సత్తిరెడ్డి, ఎంపీడీఓ పద్మావతి, తహసీల్దార్ గౌరీవత్సల్య, కీసర సర్పంచ్ నాయకపు మాధురివెంకటేష్, వార్డుసభ్యులు, ఎంపీటీసీలు వెంకట్‌రెడ్డి, నారాయణ తదితరులు



ఘట్‌కేసర్: పోచారం మున్సిపల్‌లో ప్రతిజ్ఞ చేస్తున్న తహసీల్దార్ విజయలక్ష్మి, చైర్మన్ కొండల్ రెడ్డి, ఎంపీపీ సుదర్శన్‌రెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ మాధవరెడ్డి, కమిషనర్ వేమనరెడ్డి, సీఐ అశోక్‌రెడ్డి



ఘట్‌కేసర్: అనురాగ్ యూనివర్సిటీలో అవగాహన కల్పిస్తున్న ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ మల్లేశ్, పాల్గొన్న అధ్యాపకులు, విద్యార్థులు



మేడ్చల్: మేడ్చల్ మండల పరిషత్ కార్యాలయంలో.. ఎంపీపీ రజిత రాజమల్లారెడ్డి, జెడ్పీటీసీ శైలజ విజయానందరెడ్డి, ఎంపీడీఓ పద్మావతి



శామీర్‌పేట్: మూడుచింతలపల్లిలో ప్రతిజ్ఞ చేస్తున్న ప్రజాఎంపీపీ హారికమురళిగౌడ్, తహసీల్దార్ వాణిరెడ్డి, స్థానిక సర్పంచ్ జాం రవి, ఉపసర్పంచ్ వెంకటరమణరెడ్డి, మండల వైద్యాధికారి దమయంతి, ఆర్ఐ నరేష్, ఎంపీటీసీ నాగరాజు



జవహర్‌నగర్: కార్పొరేషన్ కార్యాలయంలో.. మేయర్ కావ్య, కమిషనర్ రామలింగం, డిప్యూటీ మేయర్ రెడ్డిశెట్టి శ్రీనివాస్, కార్పొరేటర్లు, కోఆప్షన్ సభ్యులు, ఆర్‌వో ప్రభాకర్‌యాదవ్, సీనియర్ అసిస్టెంట్ శ్రీనివాస్‌రెడ్డి తదితరులు



జవహర్‌నగర్: రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ విశ్వనాథ్ ఆధ్వర్యంలో జవహర్‌నగర్ ప్రభుత్వ పాఠశాలలో ప్రతిజ్ఞ చేస్తున్న ప్రిన్సిపాల్ శంకరయ్య, ఉపాధ్యాయులు, విద్యార్థులు